క్లుప్తంగా

సీఎండీలను కలిసిన విద్యుత్ ఉద్యోగులు



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

రామగుండం: హైదరాబాద్‌లోని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డిని ఆదివారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ–1535) రాష్ట్ర ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాధాకృష్ణ, రామగుండం బీ–థర్మల్ ఉద్యోగులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శి అబ్దుల్ తఖీ, గుర్రం కుమారస్వామి, ఎస్.లవకుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఏకాదశి వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం, ఏకాదశి సందర్భంగా పూజారి శ్రవణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి మాలదారులు, మహిళలు మంగళహారతులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం 24 గంటల భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి సభ్యులు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంగ్ల నూతన సంవత్సరం కావడం, ధనుర్మాస ఉత్సవాలు జరుగుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు పూజారులు ప్రసాద వితరణ చేశారు.

బహుజన కళామహోత్సవాల్లో యక్షగానం ప్రదర్శన



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కళాకారులు

ముత్తారం: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన బహుజన కళామహోత్సవాల్లో మండలంలోని అడవిశ్రీరాంపూర్ కళాకారులు పాల్గొన్నారు. ఆదివారం అంతర్జాతీయ కళారంగ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించి కళామహోత్సవాల్లో గ్రామానికి చెందిన సాయి మారుతి కళామండలి బృందం పాల్గొని యక్షగానంపై ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో గోస్కుల రమేశ్, దుబాసి శ్రీనివాస్, కన్నూరి సత్యనారాయణ, బొనగాని సాగర్, మండల రవీందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన స్వామి వివేక్ పటేల్



సుల్తానాబాద్: మున్నూరు యువజన కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ రాజ్యసభ ఎంపీ కే. కేశవరావును హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి ప్రకాశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పోలీసులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



రామగిరిలో చిన్నారుల సంబరాలు



సుల్తానాబాద్: పొలంలో మహిళల న్యూఇయర్ వేడుకలు



నిట్టూరులో పొలం వద్ద మహిళల సంబరాలు



కాల్వశ్రీరాంపూర్‌లో ఆర్యవైశ్యుల సంబరాలు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

తీపి, చేదు జ్ఞాపకాలను మిగిల్చిన 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ ఆనందాన్ని పంచే 2023 కు వెల్‌కం చెబుతూ శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. యువకులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేకలను కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బేకరీలు, స్వీటు దుకాణాలు, చికెన్, మటన్ సెంటర్లలో సందడిగా మారాయి. అలాగే రంగవల్లుల ద్వారా నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేశారు. పలువురు అధికారులు ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

\- సాక్షి నెట్‌వర్క్



కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- స్వచ్ఛత దిశగా గ్రామాలు
- వాడవాడన పరిశుభ్రత, దోమల నివారణ
- అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



కొలనూర్‌లో ట్రాక్టర్‌లో చెత్తాచెదారం వేస్తున్న సిబ్బంది

ఓదెల: మండలంలోని పలు గ్రామాలు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో గ్రామాలు స్వచ్ఛత దిశగా పరుగెడుతున్నాయి. గ్రామాల్లో వందశాతం పారిశుధ్యం కోసం గ్రామస్తులు, పారిశుధ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. మండలంలోని కొలనూర్, గోపరపల్లె, ఓదెల, హరిపురం గ్రామాల్లో నిత్యం పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు అందరికీ ఆరోగ్యం పేరిట పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు సామ మణెమ్మ, కర్క మల్లారెడ్డి, మదు, ఆకుల ఉదయదేవి నిత్యం గ్రామంలోని ప్రధానవీధుల గుండా తిరుగుతూ పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారంతో పాటు మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు భానుప్రసాద్, ఆవుల శ్రీనివాస్, ప్రసాద్, సత్యనారాయణరెడ్డి గ్రామస్తులను చైతన్యం చేస్తున్నారు. ఇళ్లలోని తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా చేస్తు గ్రామపంచాయతీలకు చెందిన ట్రాక్టర్లలో వేస్తున్నారు. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం నిల్వ చేయటం, పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉంచకుండా దోమలు స్వైరవిహారం చేయకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రచారం చేస్తున్నారు. ప్రతీ శుక్రవారం గ్రామాల్లో జరిగే స్వచ్ఛ శుక్రవారాల్లో కాకుండా నిత్యం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మురికి కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి దోమలను నివారించి, దుర్గందంను దూరం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన రోడ్లు గతంలో కంటే మెరుగ్గా ఉన్నాయని బాటసారులు, వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. పారిశుధ్య పనులపై మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం దిశగా కృషి చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం



మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ కొలనూర్‌లో పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. గ్రామంలో 12వార్డులు, 7వేల జనాభా ఉంది. పారిశుధ్య సిబ్బంది, అధికారుల సహాయంతో ప్రధాన రోడ్లపైన చెత్తా చెదారం, మురికికాలువల పరిశుభ్రతను వందశాతం పాటిస్తున్నాం.

–సామ మణెమ్మ సర్పంచ్, కొలనూర్

చర్యలు తీసుకుంటున్నాం



మండలంలోని కొలనూర్, హరిపురం, గోపరపల్లె, ఓదెల గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రతతో అందరికి ఆరోగ్యం సాధ్యమవుతున్నది. ఆయా గ్రామాల్లో పారిశుధ్యసిబ్బందితో వార్డులతో పాటు ప్రధానరోడ్లపైన చెత్త చెదారం, మురికికాల్వల పరిశుభ్రత జరగుతుంది. గ్రామాల్లోని వార్డుల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నాం.

\- భానుప్రసాద్, కార్యదర్శి

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని కొలనూర్, గోపరపల్లె, హరిపురం, ఓదెల గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆయా గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారాల్లో కాకుండా నిత్యం తడిచెత్త, పొడిచెత్తపై ఇంటింటా అవగాహన కల్పిస్తున్నాం. చెత్తచెదారంను గ్రామపంచాయతీ ట్రాక్టర్లలో నింపుకుని గ్రామాల్లో ఊరి చివరన డంపింగ్ యార్డులో పడవేస్తున్నాం.

\- జి సత్తయ్య, ఎంపీడీవో

చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తేనే లక్ష్య సాధన



క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్ఈ, ఉద్యోగులు,యూనియన్ ప్రతినిధులు

రామగుండం: బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించినప్పుడే వందశాతం లక్ష్యాన్ని సాధిస్తామని సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. ఆదివారం బీ–థర్మల్ కేంద్ర పరిపాలన భవనంలోని ఎస్ఈ చాంబర్‌లో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్–1535 (టీఎస్‌పీఈయూ) నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన 50 ఏళ్లలో విద్యుత్ కేంద్రంలో సమష్టి కృషితో ఎన్నో మైలురాళ్లను అధిగమించామని, రాబోయే సంవత్సరంలో కూడా విద్యుత్ ఉత్పత్తిలో మరిన్ని రికార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అనంతరం నూతన సంవత్సర సంబరాలు జరుపుకుని, స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల్లో యూనియన్ రాష్ట్ర ప్రతినిధులు కుమారస్వామి, అబ్దుల్ తఖీ, రీజినల్ ప్రతినిధులు బాలకృష్ణన్, అబ్దుల్ నజ్మీ, కరణ్‌కుమార్, మోయిజ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం హనుమంతునిపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా కందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ముత్యాల రాజయ్య, ముదిరాజ్ మహాసభ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు కుంబం సంతోష్ తో పాటు సర్పంచులు, కౌన్సిలర్లు సంఘం నాయకులు సత్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జూలపల్లి: మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక మార్కండేయ ఆలయ ఆవరణలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మేరుగు రమేశ్, చిప్ప శ్రీకాంత్, రమేశ్, ఉప్పుల తిరుపతి, అందె రాజయ్య, చిప్ప రమేశ్, సంబారి ఆంజేయులు, దీకొండ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర



కలెక్టరేట్ ముందు విద్యార్థులు

ఓదెల: మండలంలోని కొలనూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లారు. జిల్లాలోని నూతన కలెక్టరేట్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామి గుడి, దేవునిపల్లె లక్ష్మినర్సింహస్వామి దేవస్థానం, ఆహ్లాదప్రదేశాలను విద్యార్థులు తిలకించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎస్ఎంసీ చైర్మన్ శ్రావణ్, హెచ్ఎం లక్ష్మణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు..



రోడ్డు పైకి వచ్చిన మురుగునీరు

సుల్తానాబాద్: పట్టణంలోని పుసాల రోడ్డులో మురుగునీరు రహదారిపైకి వస్తుండడంతో విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ మరమ్మతులు చేస్తున్నామని అధికారులకు చెప్పినప్పటికీ మూడు రోజుల నుంచి పరిస్థితి ఇలాగే ఉందని, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనుల పండువగా అయ్యప్పపడిపూజ



ఉత్సవమూర్తికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: అయ్యప్పస్వామి పడిపూజను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తిలక్ నగర్‌లోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. 24 గంటల అఖండ శరణుఘోష జరిపారు. కేరళ గురుస్వామి సంజీవ్ నంబూద్రి చేతుల మీదుగా పడిపూజను శాస్త్రోక్తంగా జరిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండేలా హరిహరసుతుడు అయ్యప్పస్వామి ఆశీర్వదించాలని వేడుకున్నారు. నూతన సంవత్సరంలో ఏలాంటి ఆటంకాలు ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రజలు అయ్యప్పస్వామి వారి దీవించాలని కోరారు. పూజలో డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు రమేశ్ బాబు, ప్రసాద్‌రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి దీక్షాపరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రౌతు రమేశ్, సుధాకర్‌రావు, వీరారెడ్డి, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా అయ్యప్ప రథోత్సవం

రామగుండం: పట్టణంలో శ్రీ అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలతో ఆదివారం రథయాత్ర వైభవంగా నిర్వహించారు. వందలాది మంది కోలాట మహిళా బృందాలు, అయ్యప్ప స్వాముల భజనలతో పట్టణం పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటుంది. ఈ వేడుకల్లో అయ్యప్ప గురుస్వాములు, మాలాధారణ స్వాములున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బీమా కోరేగాం విజయ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలని దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాసి రాంమూర్తి తెలిపారు. కోరేగాం యుద్ధం ముగిసి 205 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గోదావరిఖనిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఆత్మగౌరవం కోసం పీష్వా రాజులపై మహర్ రెంజిమెంట్ చేసిన యుద్ధాన్ని ప్రజలు స్మరించుకోవాలన్నారు. దేశంలో రోజురోజుకూ మతోన్మాదం పెరిగిపోతోందని, ప్రజల మధ్య విద్వేషం రగిల్చుతున్నారని, ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి లైజన్ ఆఫీసర్ మాస రాజయ్య, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైజర్ పులి మోహన్, రిపబ్లిక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం నగేష్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఒకటో కేటగిరి వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకుడు అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఒకటో కేటగిరి వేతనం అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి అశోక్ అన్నారు. ఆదివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ 4వ జోన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 3న కలకత్తాలో నిర్వహించే 11వ వేజ్ బోర్డు సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఒకటో కేటగిరి వేతనంపై చర్చించి అమలు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. 2, 3 తేదీల్లో సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గట్టయ్య,రాయమల్లు, పోషం, జయ, గౌరక్క, సుగుణ, శంకరమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో ముందుకు సాగాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్

మంథని: నూతన సంవత్సరంలోనూ కొత్త ఉత్సాహంతో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని బ్రదర్ ఎండపల్లి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మంథని పవర్ హౌజ్ కాలనీ సీయోను ప్రార్థనా మందిరంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గడిచిన సంవత్సరంలో చెడు అలవాట్లను వదిలేసి , నూతన సంవత్సరంలో మంచి అలవాట్లతో ముందుకు సాగాలన్నారు. నూతన సంవత్సర కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలు, వృద్ధులు, వితంతులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ఫీల్డ్ ప్రదాన కార్యదర్శి అంకరి కుమార్, పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, వాసాల జాన్, మంథని మార్క్, కలువల సామ్యేల్, తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

రామగుండం: నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్, మద్రిపల్లి గ్రామ శివారులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ హాజరుకాగా, మహిళలు ఆమెను సన్మానించారు.

ప్రాణాలతో చెలగాటం



ఓబీ కుప్ప నుంచి బొగ్గు ఏరుతున్న నిర్వాసితులు

రామగిరి: ఈ చిత్రంలో ఓబీ కుప్పల నుంచి బొగ్గు ఏరుతోంది ఎవరో కాదు.. స్వయంగా సింగరేణి సంస్థ విస్తరణలో సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులు. చేసేందుకు పని లేక జీవనోపాధి కోసం ఇలా.. తమ ప్రాణాలను పణంగా పెట్టి ఓబీ కుప్పల నుంచి బొగ్గును ఏరుకునే పరిస్థితి వచ్చింది వారికి. ఓబీ కుప్పల్లో లభించే కొద్దిపాటి బొగ్గును సమీపంలోని ఇటుక బట్టీల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇలా బొగ్గు సేకరించే సమయంలో బండరాళ్లు కూలి పలువురు మృత్యువాతపడిన సంఘటనలూ ఉన్నాయి. ఈ దుస్థితి నుంచి వారిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.